## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

భైంసా, జూన్ 20 : బుద్ధ –అంబేద్కర్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ ముథోల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాళ్ల బోరిగాంలో తొలగించిన బుద్ధ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలని కోరారు. వీరికి బుద్ధ అంబేద్కర్ ఐడల్ ప్రొటెక్షన్ అధ్యక్షుడు దేవీదాస్ హస్డే, పలువురు మద్దతు తెలిపారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

నార్నూర్, జూన్ 20 : పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని విజయ్‌నగర్ కాలనీలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి లార్వా పట్టిన కలుషిత నీటి పారబోస్తూ, శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈవో తులసీదాస్, సత్తవ్వ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్త పట్టా రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ఉట్నూర్, జూన్ 20: కొత్తగా పట్టా వచ్చిన రైతులు ఈ నెల 20వ తేదీలోగా రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఉట్నూర్ వ్యవసాయ శాఖ మండల అధికారి రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం పట్టాదారు పాస్ పుస్తకం, డిజిటల్ సంతకమైన జిరాక్స్, ఆధార్ కార్డు, బ్యాంక్ సేవింగ్ ఖాతా జిరాక్స్, పూర్తిగా నింపబడిన దరఖాస్తు ఫారంతో తమ క్లస్టర్ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారికి సమర్పించాలని సూచించారు.

## ఇంగ్లిష్ ఉపాధ్యాయ పోస్టుకు ..

బోథ్, జూన్ 20 : ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని ఆదర్శ పాఠశాలలో ఇంగ్లిష్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులకు బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైనా వారు ఈ నెల 25వ తేదీలోపు ధృవపత్రాలు జత పరుస్తూ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంఏ ఇంగ్లిష్ తో పాటు పాటు బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు.

## బీసీ బాలికల వసతి గృహంలో ప్రవేశానికి..

ఇచ్చోడ, జూన్ 20 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని బీసీ బాలికల వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని హాస్టల్ వార్డెన్ వీ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఎదులాపురం,జూన్ 20 : ఆదిలాబాద్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నోడల్ ఆఫీసర్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ కస్తాల చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం రిమ్స్ ఆవరణలోని అయుష్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యోగా దినోత్సవానికి సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ నోడల్ ఆఫీసర్ శ్రీకాంత్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ప్రీతల్ రాథోడ్, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మ చైర్మన్లు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

తానూర్, జూన్ 20 : ప్రభుత్వం నియమించిన భైంసా ఆత్మ చైర్మన్ సిద్దంవార్ వివేకానంద, ముథోల్ ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి, 54 మంది ఆత్మ డైరెక్టర్లను శుక్రవారం తానూర్‌లోని రైతు వేదికలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు, పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, మాజీ మంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నేడే చివరి తేదీ

బాసర, జూన్ 20 : రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజిస్ట్(ఆర్జీయూకేటీ) బాసరలో అడ్మిషన్ల కోసం ఈ నెల 21 శనివారం వరకు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఇప్పటి వరకు 18,775 దరఖాస్తులు వచ్చాయని, అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రవేశాలకు సంబంధించి అలాట్‌మెంట్ జూలై 4వ తేదీన ప్రకటించడం జరుగుతుందని, జూలై 7న మొదటి విడుత కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

## ఆర్జీయూకేటీలో సైబర్ భద్రతపై అవగాహన

బాసర, జూన్ 20 : నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం సైబర్ భద్రతపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీఐసీఐ బ్యాంకు అధికారులచే నిర్వహించబడిన కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, సిబ్బందికి సైబర్ భద్రతపై అవగాహన పెరిగిందని, భవిష్యత్‌లో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహిచేందుకు వర్సిటీ కృషి చేస్తుందని తెలిపారు. డిజిటల్ మోసాలు, సైబర్ భద్రతపై సమగ్ర అవగాహన కల్పించబడిందని అన్నారు. ఐసీఐసీఐ బ్యాంకు రిజినల్ మేనేజర్ రామరావు, సిబ్బంది శ్రీనివాస్, అసోసియేట్ డీన్లు డాక్టర్ విఠల్, డాక్టర్ నాగరాజు, చీఫ్ వార్డెన్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కూలిపోయే స్థితిలో మరిన్ని పాఠశాలల భవనాలు

కుంటాల, జూన్ 20 : కుంటాల మండలంలో వెంకూర్, ఓలా, లింబా (బీ), సూర్యపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాలను శుక్రవారం తహసీల్దార్ కమల్ సింగ్ పరిశీలించారు. ఈ నాలుగు పాఠశాల భవనాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయని, నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల సూచన మేరకు కూల్చివేతకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో లింబాద్రి, ఎంఈవో ముత్యం ఉన్నారు.

## ఎన్ఆర్ఈజీఎస్ పనుల పరిశీలన

కడెం, జూన్ 20: కడెం మండలంలోని నవాబుపేట, కొత్తమద్దిపడగ గ్రామాల్లో ఐదేళ్లలో చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పనులను నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్ సభ్యులు అరవింద మిత్ర గోవిందరాజులు సమక్షంలో పరిశీలించారు. ఫారంఫండ్, చిన్న నీటికుంటలు, అటవీ భూముల్లో తవ్విన కందకాలు, వాటికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీవో నాగవర్ధన్, సీఆర్డీ టెక్నికల్ పర్సన్ అంబేద్కర్, డీఆర్పీ గంగప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, ఎంపీడీవో అరుణ, ఎంపీవో కవిరాజ్, ఏపీవో జయదేవ్ పాల్గొన్నారు.

## వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

ఖానాపూర్, జూన్ 20: అడవుల్లో వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని నిర్మల్ జిల్లా ఖానాపూర్ ఎఫ్ఆర్వో కిరణ్ హెచ్చరించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వన్యప్రాణులను వేటాడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు ముగ్గురి వ్యక్తులను పట్టుకున్నట్లు వివరాలు వెల్లడించారు. కొన్ని నెలలుగా ఖానాపూర్, నిర్మల్ జిల్లాలతో పాటు నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఎనిమిది మంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి కవ్వాల్ అభయారణ్యంలో వన్యప్రాణులను వేటాడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు పట్టణంలోని బస్టాండు ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరు రాత్రి వేళల్లో అటవీ జంతువులను హతమార్చి ఇతర దేశాలకు తరలిస్తున్నారు. వీటి విలువ అత్యంత ఖరీదైందని వీటి అవయవాలు శాశ్వత రోగాలకు సంబంధించిన ఔషధాల్లో ఉపయోగిస్తారని వివరించారు. వీరి నుంచి షిఫ్టు కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ ఎఫ్ఎస్‌వో రవీందర్, సిబ్బంది ఉన్నారు.

# సీఆర్టీకి ఆర్థిక సాయం



సీఆర్టీ రాథోడ్ ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న ఉపాధ్యాయులు

నమస్తే ఎఫెక్ట్

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 20 : ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం చెమ్మన్‌గూడి గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలో సీఆర్టీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ ప్రభాకర్‌కు ఇటీవల గొంతు క్యాన్సర్ నిర్ధారణ కావడంతో శస్త్ర చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 9వ తేదీన ఆయనకు రూ.2 లక్షలతో శస్త్ర చికిత్స జరిగింది. రేడియేషన్ చికిత్స కోసం అదనంగా రూ.5 లక్షల వరకు అవసరమవుతుందని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 18వ తేదీన ''ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు'' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందనగా సిరికొండ మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, సీఆర్టీ ఉపాధ్యాయులు శుక్రవారం రాథోడ్ ప్రభాకర్‌ను పరామర్శించారు. తమవంతుగా రూ.30 వేలు, అదనంగా ఇతర దాతలు మరో రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా చికిత్స కోసం రూ.4లక్షల 50 వేలు అవసరం ఉంటుందని మరికొంత మంది దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందజేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునేశ్వర్ విజయ్, సుమన్, ఆనంద్‌రావ్, కావ్య, సాయిని ప్రియాంక, సీఆర్టీ ఉపాధ్యాయులు పురుషోత్తం, సీతారాం, అమూల్ కుమార్, గణేశ్, వంశీ, సాహితీ, జయశ్రీ పాల్గొన్నారు.

# విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

### ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



ఇంద్రవెల్లి: సిబ్బందితో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఇంద్రవెల్లి, జూన్ 20 : పోలీసు సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని పోలీస్ స్టేషన్‌ను ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్‌తో కలిసి సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ ఆవరణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్టేషన్ నిర్వహణ పద్ధతులు శుభ్రంగా ఉండాలన్నారు. కేసుల్లో ఉన్న వాహనాలను పరిశీలించి, వాటి ప్రస్తుత స్థితిపై సిబ్బందిని ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ప్రతి రోజూ నవీకరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి వీలైనంత త్వరగా కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. గ్రామాల్లో పోలీసు మీ కోసం కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల దృష్ట్యా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదతో వ్యవహరించి, బాధితులకు త్వరగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్ఐ సాయన్న, సిబ్బంది ఉన్నారు.

### బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేత

ఎదులాపురం, జూన్ 20: అనారోగ్యంతో మార్చి నెలలో మరణించిన ఆర్ దిగంబర్ కుటుంబ సభ్యులకు భద్రత ద్వారా వచ్చిన రూ.8 లక్షల విలువ గల చెక్కును ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అందజేశారు. ఈ సందర్భంగా రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ ఆర్ దిగంబర్ కుటుంబ సభ్యులైన భార్య రాథోడ్ శోభాబాయి కుమారుడు, అరుణ్ కుమార్‌తో మాట్లాడారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ధి త్వరగా వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లుకు ఆదేశించారు. కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చే విధంగా సిఫార్సులను వెంటనే పంపాలని ఆదేశించారు. పింఛన్ ప్రారంభం అయ్యేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్ రావ్, సూపరింటెండెంట్ సులోచన, అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సీసీ కొండ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఐఐటీలో ర్యాంకు సాధించిన హోంగార్డు కుమార్తెకు సన్మానం

ఎదులాపురం, జూన్ 20: పోలీసుల పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆదిలాబాద్ పోలీసు ముఖ్య కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు కనక పునరామ్ కుమార్తె కే వైష్ణవి ఐఐటీలో దేశంలోనే 1581 ర్యాంకును సాధించి ఐఐటీ ముంబైలో జియో ఫిజిక్స్ కోర్సులో సీటును సాధించింది. విద్యార్థిని వారి కుటుంబ సభ్యలను ఎస్పీ స్వయంగా పోలీసు ముఖ్య కార్యాలయానికి ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డీ వెంకటి, ఎన్ చంద్రశేఖర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

లక్ష్మణచాంద, జూన్ 20: తాగునీరు కలుషితం కాకుండా అన్ని గ్రామాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని బాబాపూర్ గ్రామంలో తాగునీటిని సరఫరా చేసే పైపులు పగిలిపోయి సమస్య ఏర్పడడంతో ఆమె వాటికి మరమ్మతులు చేయించారు. అనంతరం కంజర్ గ్రామంలో వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ సహాయంతో ప్రారంభించిన కిరాణా దుకాణాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో అమీర్‌ఖాన్, ఆయా గ్రామాల గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

ఇచ్చోడ, జూన్ 20 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రమేశ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని పలు విత్తనాల, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలు విక్రయించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు విక్రయించినప్పుడు రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఆయన వెంట డీలర్లు, దుకాణ యాజమానులు ఉన్నారు.


## ధర్నాలు, నిరాహార దీక్షలు చేసి సాధించుకున్నాం

కుభీర్, జూన్ 20 : కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దళితులకు రిజర్వు కావడంతో దానిని భర్తీ చేయకుండా హోల్డ్‌లో పెట్టిందని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు నామత్కర్ దిగంబర్ అన్నారు. శుక్రవారం ఆయన ఆ సమితి నాయకులతో కలిసి నూతన చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న గోనే కళ్యాణ్‌ను శాలువాతో సత్కరించారు. మార్కెట్ కమిటీ ముందు పలు మార్లు ధర్నాలు, ఆందోళనలు, ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతో ప్రభుత్వంలో చలనం వచ్చి ఎట్టకేలకు చైర్మన్ పదవిని భర్తీ చేశారన్నారు. చైర్మెన్ పదవిని పోరాడి సాధించుకున్నామని అన్నారు. నాయకులు షేల్కే ఆనంద్, శంకర్, సంజీవ్, గణపతి, గంగాధర్, భూమేశ్, దత్తాత్రి, జీవన్ పాల్గొన్నారు.

## ఆయిల్ పాం తోటలతో లాభాలు

దస్తురాబాద్, జూన్ 20 : ఆయిల్ పాం తోటల సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని ఉద్యావన శాఖ అధికారి స్పందన, నాబార్డ్ జిల్లా అభివృద్ధి నిర్వాహకుడు వీరభద్రుడు అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌తో పాటు మండలంలోని ఆకొండపేట గ్రామంలో సాగు చేస్తున్న ఆయిల్ పాం తోటలను శుక్రవారం వారు సందర్శించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట క్లస్టర్ అధికారి నవీన్, రైతులు ఉన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల పరామర్శ



పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు విలాస్ గాదేవార్

భైంసా, జూన్ 20 : నిర్మల్ జిల్లా భైంసాలోని భట్టిగల్లికి చెందిన పురస్తు రాజన్నకు ఆరోగ్యం బాగాలేనందున శుక్రవారం బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్ పరామర్శించారు. ఆయన వెంట వాసే, సురేశ్, తదితరులు ఉన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

నార్నూర్, జూన్ 20 : తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డివిజన్ పంచాయతీ అధికారి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని మైనార్టీ, వడ్డెర కాలనీలో ఆయన పర్యటించారు. నీటి సమస్యను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో సమస్యలు ఉంటే నేరుగా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారిస్తామని తెలిపారు. ఇక్కడ ఎంపీడీవో రాథోడ్ గంగసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మోతీరాం ఉన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో సిరికొండకు మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 20 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సహకారంతో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని సిరికొండ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఓరగంటి పెంటన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ చిన్న రాజన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు రాజు లస్మన్న, సంతోష్, సాయన్న, మాధవ్, విలాస్, ఎల్లయ్య, గణేశ్, రాజు పాల్గొన్నారు.



ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

# పారదర్శకంగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లక్కీడ్రా



ఎదులాపురం: లక్కీడ్రా తీస్తున్న అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు

ఎదులాపురం, జూన్ 20: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం కింద ఆయా పాఠశాలల్లో ప్రవేశాల కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని శుక్రవారం ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ భవనంలో నిర్వహించారు. ఈ డ్రా కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ శ్యామలా దేవి పర్యవేక్షించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ప్రవేశాల కోసం ఒకటో తరగతిలో 45 సీట్లకు గాను 80 మంది, ఐదో తరగతిలో 47 సీట్లకు గాను 140 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి, వారికి ప్రభుత్వ అనుమతితో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాం, తల్లిదండ్రుల సమక్షంలో జరిగిన లక్కీ డ్రా ద్వారా న్యాయంగా అవకాశాలను కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి భగత్ సునీతా కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్‌రావు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్ చైన్‌గేట్, జూన్,20: బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో 1,5 వ తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా అధికారులతో కలిసి లక్కీ డ్రా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి రాజేశ్వర్‌గౌడ్, జిల్లా విద్యాధికారి రామారావు, సహాయ సంక్షేమాధికారి లత, పర్యవేక్షకులు శ్రీదేవి, డీసీవో ప్రశాంతి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఖానాపూర్‌లో ఏర్పాటు చేయాలి




తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

పెంబి, జూన్ 20: నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గానికి మంజూరైనా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తన చొరవతో ఆదిలాబాద్ జిల్లాలోని తన ప్రాంతమైనా ఉట్నూర్‌కు తరలించడాన్ని నిరసిస్తూ శుక్రవారం బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తహసీల్ కార్యాలయంలో డీటీ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ ఖానాపూర్ మండలంలో స్థలం లేదని సాకుతో ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌కు ఈ పాఠశాలను తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఖానాపూర్‌లోని కుమ్రం భీం చౌరస్తా వద్ద 40 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నదని ఈ పాఠశాల నిర్మాణానికి అనుకూలమైన ప్రాంతమన్నారు. ఉట్నూర్‌కు తరలిస్తే ఖానాపూర్, పెంబి, కడెం దస్తురాబాద్ మండలాల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఖానాపూర్‌లోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఖానాపూర్‌లోనే పాఠశాల నిర్మించేలా తగిన చర్యలు తీసుకోవాలని డీటీ శంకర్‌ను కోరారు. ఇక్కడ మాజీ వైస్ ఎంపీపీ గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గాండ్ల శంకర్, మహేందర్, సరోజ, సుధాకర్, బీజేపీ నాయకులు రాజేందర్ ఉన్నారు.

## స్టెప్ ఇన్‌చార్జి సీఈవోగా రాజలింగు

ఎదులాపురం, జూన్ 20 : జిల్లా యువజనలు సర్వీసుల శాఖ (స్టెప్) ఇన్‌చార్జి సీఈవోగా కే రాజలింగు శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న అధికారి వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ పొందారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న కే రాజలింగును స్టెప్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

## స్త్రీనిధి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సురేశ్

దిలావర్‌పూర్, జూన్ 20: స్త్రీనిధి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దిలావర్‌పూర్ మండల స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ ఇ సురేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం రాష్ట్ర స్త్రీనిధి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం సంపత్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే మదర్, కోశాధికారిగా బీ సైదిరెడ్డి, ఉపాధ్యక్షులుగా పీ సరిత ఆర్ రమేశ్, కే రజిత పాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడిని మండల ఐకేపీ ఏపీఎం సులోచనరెడ్డి, సిబ్బంది అభినందించారు.

## హైమాస్ట్ లైట్లు ప్రారంభం

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 20 : రాయిగూడ గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం పెందూర్ లక్ష్మణ్ రావ్ గ్రామ పటేల్, మహాజన్, దేవరితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ పంద్రం హన్మంత్ రావ్, దేవరి పంద్రం శ్రీకాంత్, మహాజన్ సిడాం మదన్ పాల్గొన్నారు.

## ట్రాక్టర్‌కు ఆర్టీసీ బస్సు ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు

### - ఒకరి పరిస్థితి విషమం

జైనథ్, జూన్ 20: భోరజ్ మండలంలోని తరోడ బ్రిడ్జి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తరోడ గ్రామానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉందని జైనథ్ ఎస్ఐ పవార్ గౌతం నాయక్ తెలిపారు. పోలీసులు, కుటుంబీకుల వివరాల ప్రకారం.. తరోడ గ్రామానికి చెందిన నలుగురు సాఫాయి కార్మికులు భోరజ్ గ్రామంలో పనులు ముగించుకొని ట్రాక్టర్‌లో తిరిగి వస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి బేల మండలం సాంగిడి గ్రామానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుండి ఢీ కొట్టింది. ట్రాక్టర్ బోల్తా పడడంతో ట్రాక్టర్‌లో ఉన్న లక్ష్మణ్(54)కు తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా మెస్త్రం శంకర్, మెస్త్రం చిరంజీవి, మెస్రం సాజన్ వాగులో పడిపోవడంతో గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గ్రామస్తులు వెంటనే క్షతగాత్రులను ఆటో ద్వారా చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. లక్ష్మణ్ పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. ఆర్టీసీ డ్రైవర్ మైలారపు ప్రభాకర్ నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని పలువురు అంటున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైతులకు అవసరమైన పనులు చేపట్టాలి

ఇంద్రవెల్లి, జూన్ 20: ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో రైతులకు అవసరమైన పనులు చేపట్టాలని మినిస్టరీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి కిరణ్ చరన్ పదే అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని ఎస్టీ కాలనీ, ప్రబుద్ధనగర్, మిలింద్‌నగర్ కాలనీల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులు పరిశీలించారు. అనంతరం మండలంలోని వ్యవసాయ భూముల్లో చేపట్టిన పనులు పరిశీలించారు. ఏ పనికి ఎన్ని నిధులు మంజూరయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈజీఎస్ పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు రఘుకుమార్, సీఆర్డీ హైదరాబాద్ మురళీధర్, డీఆర్డీపీ రాథోడ్ రవీందర్, డీఈ జాడి లింగన్న, ఏఈ ప్రభుకిరణ్, శ్రీనివాస్, టీపీ సంతోష్, జైస్వాల్, మహేందర్, విఠల్, ప్రకాశ్ ఉన్నారు.

## పంట పెట్టుబడి నిధులు జమ

ఎదులాపురం, జూన్ 20 : వానకాలం – 2025 సీజన్‌కు పంట పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో 1,68,238 మంది రైతులకు గాను రూ.342.3 కోట్లు కేటాయించడం జరిగిందని కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వరకు 1,33,808 మంది రైతులకు గాను రూ.212.74 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు

## వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

బోథ్, జూన్ 20: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న లోక రాజేందర్ రెడ్డి(53) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన రాజేందర్ రెడ్డి మూడు నెలలుగా బోథ్‌లో ఉంటున్నాడు. కేజీబీవీలో రెండు నెలల నుంచి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మానసిక ఆరోగ్యం బాగా లేనందున కేజీబీవీ ఆవరణలో చెట్టుకు కరెంట్ తీగతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజేందర్ రెడ్డి అల్లుడు పీ విజయ రాజారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## భార్య కాపురానికి రావడం లేదని..

తలమడుగు, జూన్ 20 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం దోర్లి గ్రామానికి ఎం ప్రవీణ్(30) వ్యవసాయం చేస్తున్నాడు. తన భార్య పుట్టింటికి వెళ్లి కాపురానికి రాకపోవడంతో మద్యం తాగిన మైకంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాధిక తెలిపారు.

## చిరుత పులి దాడిలో ఆవు దూడ మృతి

బోథ్, జూన్ 20 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని రఘునాథ్‌పూర్ అటవీ ప్రాంతంలో చిరుత పులి దాడిలో ఆవు దూడ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన ఆవుల మందపై గురువారం సాయంత్రం చిరుత పులి దాడి చేసింది. రాథోడ్ పరశురాం(గోపాల్ పేట్)కు చెందిన ఆవు దూడను చంపివేసింది. కాపారి కేకలు వేయడంతో చిరుత పులి వెళ్లి పోయింది. ఆవు దూడ మృతితో బాధిత రైతుకు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లింది. అటవీ శాఖాధికారులు కల్పించుకొని నష్టపరిహారం అందేలా చూడాలని బాధిత రైతు కోరుతున్నాడు.

## నిందితుడి ఆత్మహత్యాయత్నం

గుడిహత్నూర్, జూన్ 20 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో శుక్రవారం ఓ నిందితుడు అరుణ్ బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఘటన వివరాలు ఇలా...మండల కేంద్రానికి చెందిన వస్తాద్ అరుణ్‌పై గతంలో కేసు నమోదు కాగా కోర్టు విచారణకు నిందితుడు హాజరుకాకపోవడంతో నాన్ బెయిబుల్ వారెంట్ జారీ అయింది. ఆ నిందితుని ఇంటికి వెళ్లి కోర్టుకు హాజరుకావాలని తెలుపగా ఇంటిలో లేరని తెలిపారు. ఈ క్రమంలో నిందితుడి కోసం గాలిస్తుండగా మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ వద్ద కనిపించగానే పోలీసులు నిందితుని దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులను చూసిన అరుణ్ తన దగ్గర ఉన్న బ్లేడ్‌తో గొంతుకోసుకునే ప్రయత్నంలో గాయాలయ్యాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. నిందితుడు గతంలో బ్లేడుతో స్థానిక పోలీస్ స్టేషన్‌లోనే ఎస్ఐ, హోంగార్డులపై దాడి చేసి గాయపరిచాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి

తానూర్, జూన్ 20 : నిర్మల్ జిల్లా తానూర్ మండలం దౌలతబాద్ గ్రామంలోని మూలబాగే ఆనందరావు రైతుకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. శుక్రవారం ఉదయం మేతకు వెళ్లిన గేదె విద్యుత్ డీటీఆర్ సపోర్ట్ తీగకు తగలడంతో మృతి చెందింది.గేదె విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

## నర్సరీలోకి చొచ్చుకెళ్లిన కారు

కుంటాల, జూన్ 20 : నిర్మల్ జిల్లా కుంటాల మండలం అందకూర్ గ్రామంలోని నర్సరీలోకి ఓ కారు ప్రమాదవశాత్తు చొచ్చుకెళ్లిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పలువురు గ్రామస్తులు నర్సరీలో కారు ఉండడం గమనించారు. వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కారులో ప్రయాణించిన వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఎదులాపురం, జూన్ 20: ఆదిలాబాద్‌లోని ఆర్టీవో ఆఫీస్ సమీపంలోని ఫ్లై ఓవర్ ప్రాంతంలో వద్ద మహాలక్ష్మి వాడకు చెందిన రాథోడ్ దత్తు, వాటోరే సంతోష్ గంజాయి సేవిస్తున్నారు. గంజాయి నిర్ధారణ పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చింది. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు.

## వానరానికి అంత్యక్రియలు

బోథ్, జూన్ 20: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని మర్లపల్లి గ్రామంలో శుక్రవారం వానరంపై కుక్కల దాడి చేశాయి. తీవ్ర గాయాలైన కోతిని యువకులు చికిత్స నిమిత్తం బోథ్ పశు వైద్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడున్న సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించిన కోతి మృతి చెందడంతో యువకులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంగ్లకర్ నరేశ్, ఆకాశ్, కోసగంటి అభి, తుకారాం, మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్, సంతోష్, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.